# గ్రంథ సమీక్ష

## సర్వార్థ చంద్రిక

### (భాగం 1, 2)

(గ్రంథకర్త : శ్రీ ముళ్ళపూడి లీలా కృష్ణ మూర్తి, పార్టు – I, సైజు : 1/8 డెమ్మి, పుటలు: 482,వెల: 150–00రూ లు.-- పార్టు – II – పుటలు: 613, మూల్యం : 195–00, ప్రతులకు : ముళ్ళపూడి లీలా కృష్ణమూర్తి, జ్యోతిష్యాలయం, ఇంటి నెం. 26–28–1, 1 వలైను, పట్టాలపక్క రోడ్డు, ఎ.టి. అగ్రహారం, గుంటూరు.)

భారతీయ సంస్కృతికి మూలాధారమైనది వేదం. వేదానికి ప్రధానాంగాలైన శిక్ష, వ్యాకరణం మొదలైన ఆరింటిలో అత్యంత ముఖ్యమైనది, 'జ్యోతిషం నయనం స్మృతం' అని వేద పురుషునకు నేత్రంగా పేర్కొనబడినది జ్యోతిషం. జ్యోతిస్స్వరూపాలైన సూర్య, చంద్రాది గ్రహాలయొక్క అశ్విన్యాది నక్షత్రాలయొక్క ప్రభావాలను, వాటి ఫలితాలను పరిగణించటంతో ప్రవర్తిల్లిన శాస్త్రం కనుక, ఈ వేదాంగానికి 'జ్యోతిష' మనే నామ ధేయం సార్థకమై వెలసింది.

ఆయా ప్రారబ్ద కర్మల ననుసరించి ఈ లోకంలో జన్మించినందువలన మానవులు గత జన్మల్లో తాము సుకృత, దుష్కృతాల ఫలితాలను ముందుగానే తెలిసికొని, తదనుగుణంగా తమ తమ జీవన విధానాలను చక్కదిద్దుకోవటానికి అపూర్వమైన అవకాశాన్ని అందించే ఏకైక శాస్త్రం జ్యోతిషం. జీవితానికి సంబంధించిన అనేక అత్యావశ్యక విషయాలను వెల్లడించటం వలన, ప్రతి వ్యక్తీ తన జీవిత సమయాన్ని సద్వినియోగం చేసుకొనడానికి జ్యోతిషం అత్యంతం సహకరిస్తుంది. అందువల్ల మానవుడు ఉత్తమ కర్మలను ఆచరిస్తూ, అభీష్టాలను అందుకొంటూ క్రమేణ చతుర్విధ పురుషార్థాలను సాధించటం ద్వారా జీవయాత్రను సార్థకం చేసికోగలడు. అటువంటి ఉత్తమ పథంలో పయనించటానికి మానవజాతికి మణిదీపిక వంటిది జ్యోతిషం. ఒక్కమాటలో – భూతం, వర్తమానం, భవిష్యత్తు అని ముత్తెఱుగులుగా భాసిస్తూవున్న కాలంయొక్క స్వరూప, స్వభావాలను శాస్త్రీయంగా ఆవిష్కరించడం ద్వారా సమాజంయొక్క మనుగడకు ఎంతగానో ఉపకరించే ప్రత్యక్ష శాస్త్రం జ్యోతిషం.

ఇటువంటి విలువైన ఈ జ్యోతిర్విద్యను పరాశరుడు జైమిని మొదలైన ప్రాచీన మహర్షులు లోకానుగ్రహబుద్ధితో ఆయా గ్రంథాల రూపంలో వెలయించియున్నారు. అయితే, ఆ మహనీయులు నెలకొల్పిన ఆ గ్రంథాలు సంస్కృతభాషలో ఉండటంచేత అందలి విషయాలు సామాన్య మానవునికి అందుబాటులో లేకుండినాయి ఇది ఇలా ఉండగా, ఈ జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానంయొక్క విశిష్టమైన ఆవశ్యకతను గుర్తించిన ప్రముఖ పండితులు శ్రీముళ్ళపూడి లీలాకృష్ణమూర్తి గురుకుల విద్యగా పెక్కేండ్లు జ్యోతిశ్శాస్త్రాన్ని చక్కగా అభ్యసించిన వారవడంచేత – ఆయా ప్రాచీన సంస్కృత గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం కావించి వాటిలో సర్వజనులను నిత్యం ఉపకరించే అనేక ముఖ్య విషయాలను సేకరించి, క్రోడీకరించి, అనుభవ జ్ఞానంతో వాటిని సమన్వయించి, తేట తెలుగున సులభ శైలిలో ''సర్వార్థ చంద్రిక'' అనే పేర ఈ అపూర్వ గ్రంథాన్ని సమకూర్చారు.

ఈ గ్రంథంయొక్క 1 వ భాగం ముహూర్త, జాతక, ప్రశ్న, సంఖ్యలనే నాలుగు ప్రధాన భాగాలకు సంబంధించిన ఆరు వందల పై చిలుకు అంశాలు ఆహ్లాదకరంగా వివరింపబడి వున్నాయి. ఈ మొదటి భాగం ఇప్పటికే ఆరు ముద్రణలు పొందివుండటం దీనికి గల ప్రజాదరణకు ప్రకృష్టమైన నిదర్శనం.

ఇక ఇటీవల ప్రచురింపబడినరెండవ భాగం ప్రత్యేకంగా జాతక విభాగానికి సంబంధించినదై చక్కగా విశదీకరింపబడిన ఐదువందల పైచిలుకు అంశాలతో అలరారుతూ వుంది.

ఈ గ్రంథంలో ఎడనెడ శ్లోకాలు, పట్టికలు, సూచికలు, యంత్రాలు, మంత్రాలు, కవచాలు, సూక్తాలు, స్తోత్రాలు, సూక్తులు, సూచనలు – సందర్భానుగుణంగా చోటు చేసుకొని, దీని ప్రామాణికతను ఇనుమడింప చేస్తూవున్నాయి.

ఈ గ్రంథంయొక్క ముఖచిత్రం గ్రహ, నక్షత్ర సహితమైన ఖగోళం. ఈ వర్ణ చిత్రం గ్రంథస్థ విషయానుగుణంగా సాభిప్రాయం అమరివుంది. అలాగే పార్టు I అట్ట వెనుకగల 20 వ శతాబ్దపు కేలండరు, పార్టు 2 వెనుకగల నవగ్రహవర్ణ చిత్రాలు, వాటి నడుమ చిత్ర విచిత్రమైన రాశీ, నక్షత్ర సమన్వితమైన వృత్తాకార జాతక చక్రం సప్రయోజకంగా, సముచితంగా అందగించి వున్నాయి.

మొత్తం మీద ప్రాచీనాధునిక విజ్ఞాన సమన్వయ దృక్పథంతో రచింపబడిన ఈ ''సర్వార్థ చంద్రిక'' సార్థక నామధేయంగా అలరారుతూ వుంది. ఈ వినూత్న గ్రంథాన్ని రచించిన శ్రీ ముళ్ళపూడి లీలాకృష్ణమూర్తి దైవజ్ఞుల అవిరళ కృషి మిగుల అభినందింపదగి వుంది.

**ఆచార్య కె.జె.కృష్ణమూర్తి**